# గాడి తప్పని గానుగెద్దులు

"అమరశ్రీ"

"ఛాలెంజ్ చేస్తాను. వాళ్ళలో ఒక్కడిని జీవితాన్ని గురించి ఆలోచించమను. అసలు చేతకాదు. అంతే. అసలు వాళ్ళు అనుభవించేది జీవితం అయితేగా, జీవితాన్ని గురించి ఆలోచించటానికి. ఈ చచ్చుపీనుగులకు అసలు ఏం తెలుసు జీవితం అంటే?" అంటాడు వెంకటేశం. అందుకనే చాలమంది అంటారు వెంకటేశానికి జీవితం అంటే ఏమిటో కూడా తెలియదని.

లోకంలో అందరూ వెంకటేశాన్ని గురించి మాట్లాడుకున్నట్లే, వెంకటేశం కూడ ఎప్పుడూ ఈ ప్రపంచాన్ని గురించే ఆలోచిస్తూ ఉంటాడు. అసలు ఈ విశాల ప్రపంచంలో వెంకటేశం ఏ ఒక్కడినీ మనిషిక్రింద పరిగణించడు.

అసలు ఎందుకు పరిగణించాలి? అంటాడు. వాళ్ళందరు ఈ చచ్చుబ్రతుకు ఎందుకు బ్రతుకుతున్నారా? అని ఎప్పుడూ అనుకుంటూ ఉంటాడు వెంకటేశం. ప్రొద్దున్నే లేవటం, ముఖం కడుక్కోవటం, కాఫీ త్రాగటం, పెళ్ళాం ఉంటే ఆవిడగారితో కాస్సేపు సరసాలాడటం, కాస్సేపాగి ఆవిడ పెట్టిన అన్నం తినటం, ఆఫీసుకు పోవటం, అయిదు గంటలకు తిరిగి రావటం, కాళ్ళలో సత్తువ ఒంట్లో చేవ ఉంటే బీచికి పోవటం, ప్రొద్దుకూకే సమయంలో ఇంటికి తిరిగి రావటం, అన్నం తినటం, పడుకోవటం - ఇవేగా తెల్లారి లేస్తే ఈ చచ్చు ముఖాలన్నీ చేసే పనులు. ఈ వంద సంవత్సరాల జీవితం మరో వంద సంవత్సరాలకు పొడిగిస్తే వీళ్ళందరూ ఆమోదించి, హర్షించి మరీ స్వీకరిస్తారు. ప్రతిరోజూ ఇటువంటి పనులు క్రమం తప్పకుండా, చేస్తున్నా వాళ్ళకు విసుగు పుట్టదు. మరో వంద సంవత్సరాలు ప్రతిరోజు ఇవే పనులు చేయటానికి సంసిద్ధులుగా ఉంటారు ఎమ్. ఏలు, పి, హెచ్. డి.లు చదివిన వాళ్ళకి ఈ మాత్రం ఇంగిత జ్ఞానం లేకపోవటానికి కారణమేమిటో? అని బుర్రబద్దలు కొట్టుకుంటాడు ఏరోజుకారోజు వెంకటేశం.

ప్రొద్దున్నే ప్రతిరోజు సరిగ్గా ఆరుగంటలకు లేచేవాడికి తొమ్మిదిన్నరకు లేచే వాడిని చూస్తే చులకన, ఎగతాళి, తక్కువదనమూను. ఇష్టం వచ్చినపుడు నిద్రలేచే ధైర్యం లేక, అలా లేచేవాళ్ళని చూసి ఏడుస్తారు చాలమంది. కనీసం ఆదివారంనాడు కూడా వాళ్ళు ఆరుదాటిపండుకోలేరు. ఆరింటికే లేవకపోతే భార్య విసుక్కుంటుందనే భయం. అసలు వాళ్ళు భార్యని ఏమాటా అనలేరు. అంటే ఏం జరుగుతుందోననే భయం. రెండు రోజులు మాట్లాడదు అంతేగా? ఈ భార్య మాట్లాడకుండా మూతి బిగించటమనేది వాళ్ళ దాంపత్య జీవితంలో ఒక మచ్చగా పరిగణిస్తారు. ఇటువంటి చిన్న చిన్న కదలికలు కూడ లేని దాంపత్య జీవితం వీళ్ళందరి దృష్టిలో ఆదర్శమూ, అనుసరణీయమూను. ఆ ఆడవాళ్ళు కూడా కుళ్ళు సరుకే. వాళ్ళకే ఈ జీవితం అంటే, మగాళ్ళంటే ఇష్టం.

లేకపోతే వెంకటేశం భార్య, వెంకటేశానికి విడాకులిచ్చి, వెంకట్రావుని పెళ్ళి చేసుకోనేదికాదు. వెంకటేశం అందరిలాటివాడు కాకపోవటంవల్ల వచ్చింది ఈ ఇబ్బంది అంతా. వెంకట్రావులాటి కుళ్ళుమనిషిగానూ, చచ్చు మనిషిగాను తయారు కాదలచుకోలేదు వెంకటేశం భార్య కోసమని. ఆవిడ విడాకులిచ్చిందని చింతించనూ లేదు. ఈ వెంకట్రావ్ లాటిరకం మనుషులు యంత్రాలలాటి స్త్రీలతో, చచ్చు జీవితం గడుపుతున్నారని వెంకటేశం ముప్ఫైయేళ్లు ఈ ప్రపంచంలో బ్రదికి గ్రహించిన విషయం. పైగా వాళ్ళందరూ అలాటి చప్పటిజీవితం గడుపుతూ ఏదో మేము బావుకు తింటున్నామని గొంతు చించుకుంటారు. అక్కడే వస్తుంది వెంకటే-

శానికి వాళ్ళందరి మీదా కోపం. అటువంటి వెధవ జీవితం గడుపుతున్నప్పుడు నిర్భయంగా అంగీకరించాలి, మేము గడిపేది ఇటువంటి జీవితమే నని. అంగీకరించటానికి ధైర్యం ఏడిస్తేగా? వాళ్ళందరూ ఈ విధంగా జీవించటానికి తప్ప మరెందుకూ పనికిరారని కూడా తెలుసు వెంకటేశానికి. వాళ్ళని మారుద్దామని ఎవడన్నా బయలు దేరినా వాళ్లు మారరు. ఇదంతా తలచుకొని ఒక్కసారి పెద్దపెట్టున నవ్వుకుంటాడు వెంకటేశం.

ఏ రోజునన్నా ఆఫీసులో మేనేజరు తిట్టకపోతే వాళ్ళకు అన్నం తిననట్లే ఉంటుంది. ప్రతిరోజు తిట్లు తింటేగాని కడుపునిండదు. ప్రతిరోజు తిడితేగాని అన్నం తినబుద్ధికాదు మేనేజర్లకి. ఇలాటి జోకర్ల ప్రపంచాన్ని చూసినప్పుడంతా నవ్వూ, ఏడుపూ ఒకేసారి వస్తయ్ వెంకటేశానికి.

కాఫీ త్రాగేవేళకి కాఫీ లేకపోతే ఒకటే ఏడుపు. అదేమంటే అలవాటు. గిలగిల కొట్టుకుంటారు. కాఫీ బదులు కాస్త గంజి త్రాగి ఊరుకోరాదూ? ఒకరోజు గంజి తాగితే ఏం పోతుంది? రోజూ కాఫీ తాగే షాళ్ళేగా! మరొక పురోహితుడు ముక్కుపొడుం లేందే మంత్రాలు చెప్పలేడు. చదువుకోని గాడిద దగ్గరనుంచీ, చదువుకున్న మనిషివరకూ అందరూ గాడిదలలానే కనిపిస్తున్నారు వెంకటేశానికి.

ఒకరోజు ప్రయాణం చేస్తూ ఏదో స్టేషను ప్లాటుఫారంమీద దిగాడు వెంకటేశం. జేబులో చేతులు పెట్టుకుని అటూ ఇటూ చూశాడు, రైల్వే హోటలు దగ్గర తోసుకుంటున్నారు. కండువాల పెద్ద మనుషులు మహా అవస్థ పడుతున్నారు. పెద్ద పెట్టున ఒక్కసారి నవ్వాడు వెంకటేశం. పక్కనే సూటులో ఉన్న పెద్ద మనిషి వెంకటేశం నవ్వుని, ఆ వాలకాన్ని చూసి నవ్వాడు. ఆ నవ్విన పెద్ద మనిషిని చూసి మరింత పెద్దగా నవ్వాడు వెంకటేశం. అంతే మళ్ళా ఆ పెద్దమనిషికి నవ్వురాలేదు.

అక్కడ హడావుడి తగ్గిపోయింది. వాళ్లందరూ పరుగెత్తుకుంటూ వచ్చి సాంబారు పొట్లాల మీద పడ్డారు. వెంకటేశం చాలా వింతగా చూశాడు వాళ్ళవంక. ఒక పూట అన్నం లేకపోతే వాళ్ళలో ఏ ఒక్కడూ చావడు. అదిమాత్రం ముమ్మాటికీ నిజం. ఒక పూట అన్నంకోసం ఇంతగా ఎందుకు తన్నుకులాడటం? వెంకటేశం ఆ అమ్మేచోటు దగ్గరకు పోయాడు.

ఇంతలో అయ్యరు పొట్లాలు అయిపోయినాయని చెప్పాడు. అంతే. హిరోషిమా మీద ఆటంబాంబు వేసినంత పనయింది. అప్పుడే కాలిపోయిన మతాబా ముఖాలు వేసి పూరీ తిని, కాఫీ తాగారు. వాళ్ళందరూ తన్నుకులాడి, తిని, బండిలో కూర్చున్న మీదట వెంకటేశం రైల్వే హోటల్లో దూరాడు. ఒక్క రెండు పూరీలే ఉన్నాయని ఇచ్చాడు. వెంకటేశం తింటూ ఉండగా ఎవడో సూటులో వచ్చాడు. ఏమీ లేదని, చివరకు కాఫీకూడా లేదని తెలుసుకొని ఏడుపు ముఖం పెట్టాడు. తింటూతింటూ ఉన్న పూరీ ఆ పెద్ద మనిషి కివ్వాలనిపించింది వెంకటేశానికి.

బయటకు వచ్చి సోడా త్రాగి బండిలో కూర్చున్నాడు వెంకటేశం. ప్రతి నిమిషం వాళ్ళనిగురించి అతిగా ఆలోచించటం తప్పటం లేదు వెంకటేశానికి. ఇది ఒక అలవాటు క్రింద మారేలా కనుపించింది.

రైలు ఆగే చోటువరకూ పోయాడు. అక్కడనుంచి పోయాడు ఎక్కడికో. వెంకటేశం తోటి రచయిత ఒకడు వెంకటేశం పోయినందుకు ఏడుస్తూ, ఏ హిమాలయాలకు వెళ్ళిపోయాడో ననుకుంటూ రాసిన గేయాన్ని వెంకటేశం చదవటం కూడా తటస్థించింది.